
*నీతి, నిజాయితీ ఎంతటి కష్టాలను అయినా ఎదుర్కొనడానికి బలాన్ని ఇస్తాయి. కష్టాలు తొలగితే వాటికి విలువ ఉండదు. వివర్జించనూ వద్దు.*




# నాకీ జీవితం వద్దు

పి. సి. పట్నాయిక్

“మే ఐ కమిన్ సార్?”

ప్రవాహంలో కొట్టుకొనిపోతున్న లెక్చరర్ గారి ధోరణికి ఆనకట్ట కట్టినట్టు అయింది. ఆనకట్ట కట్టిన కాటన్‌దొర ఎవరా అని రెండు వందల జతల కళ్ళు ఆశ్చర్యంగా గుమ్మంకేసి తిరిగాయి.

“ఆలస్యంగా వచ్చి నన్ను 'డిస్టర్బ్' చేయద్దని ఎన్నిసార్లు....” చిరాగ్గా గుమ్మంకేసి తిరిగిన లెక్చరర్ ఆశ్చర్యంతోపడి ఆగారు, అక్కడ ఉన్న ముల్లంగి దుంపలాంటి కొత్త శాల్తీని చూచి. ఆవక ఆశ్చర్యంనుండి తేలి “ఎవరు?” అని అడిగారు, కొత్తశాల్తీని.

ఆ కంఠస్వరం విని ఈ లెక్చరర్ ఎవరో కొస్త ఘాటురకం అనుకొని, “కొత్త విద్యార్థిని” అన్నాడు అతడు వదురూ బెదురూ లేకుండా.

తన స్వరం, తన భారీ విగ్రహం కొత్తవాణ్ణి కాస్త అయినా భయపెట్టలేక పోయాయి అన్న నిరుత్సాహం కలిగింది లెక్చరర్‌గారికి. “పేరు?” సాధ్యమైనంత గంభీరంగా అడిగారీసారి.

“గోపీకృష్ణ.” చెప్పాడు నెమ్మదిగా అయినా స్పష్టంగా.

“ఏ ఊరునుండి?”

ఈ రెండు వందల జతల కళ్ళూ తనను ఏదో 'జూ'లో వింత జంతువును చూచినట్టు చూస్తూంటే ఇబ్బందిగా ముఖం పెట్టాడు గోపీ. అయినా తనను లోనికి రమ్మనకుండానే గుమ్మందగ్గరే నిల్చోబెట్టి మరీ ప్రశ్నల వర్షం కురిపిస్తున్న లెక్చరర్ ధోరణికి చిరాకు కలిగింది అతనికి. “లోనికి రానివ్వండి. అన్ని ప్రశ్నలకీ జవాబు చెప్తా” అన్నాడు చిరాకును సాధ్యమైనంత కప్పిపుచ్చుతూ.

మెత్తని చెప్పుతో కొట్టినట్టు అయింది ఆయనకు. ఈ రెండు వందల మందీ తనను చూచి నవ్వుకొంటున్నారేమో అన్న అనుమానం కలిగి, “రా” అన్నారాయన ఎలాగో.

గేలరీ పై అంతస్థుకు ఎక్కుతున్న గోపీని చూచి 'అసాధ్యుడులా ఉన్నాడు' అనుకొన్నారు విద్యార్థులు. 'ఇంచక్కా “బిశ్వజీత్”లా ఉన్నాడమ్మా' అనుకొన్నారు విద్యార్థినులు. 'కొరకరాని కొయ్యలా ఉన్నాడు' అనుకొన్నారు లెక్చరర్. అలా అనుకోవడం చేదుమాత్ర మింగినట్టు అనిపించింది. 'ఛ. వీడి వయస్సు అంతా కలిపి నా సర్వీసు అంతలేదు; వీడా నన్ను ఎదిరించేది?' అనుకొన్నారు ఆవక. “ఎక్కడనుండి?” మళ్ళీ అడిగారాయన కూర్చుంటున్న గోపీని.


వదిలిపెట్టేటట్టు లేడు అనుకొని “మద్రాసునుండి” అన్నాడు క్లుప్తంగా. “ఓ మద్రాసు వరకా?” ఏదో రహస్యం కనిపెట్టేసిన వాడిలా అన్నారు ఆయన.

గోపీ మనస్సు చివుక్కుమంది. ఎంత లెక్చరర్ అయితే మాత్రం ఇంత అవమానకరంగా మాట్లాడుతాడా? గట్టిగా సమాధానం చెప్పాలనుకొన్నాడు గాని మొట్టమొదటి రోజే గొడవ తెచ్చుకోవడం ఇష్టంలేక ఊరుకొన్నాడు. గోపీ మాటాడక పోవడంతో విజయం పొందిన వీరకుమారుడులా మళ్ళీ ప్రవాహంలో మునిగిపోయారు లెక్చరర్.

తెలిసిన ముఖాలేమైనా ఉన్నాయేమోనని హాలు అంతా కలయజూచాడు గోపీ. మొదటి వరసలో అమ్మాయిల ప్రక్క 'వింగ్'లో మొదటిశాల్తీ వెనక్కు తిరిగి తనవైపే చూస్తూ చిరునవ్వు నవ్వుతూంది. 'ఎవరు చెప్మా?' అని కాస్సేపు మెదడుకు పనిచెప్పి '720 పేజీలు' వెనక్కు త్రిప్పేసరికి నాగేశ్వరరావు జ్ఞాపకం వచ్చాడు. 'ఓరి వీడా! ఎంత మారిపోయాడు!' అనుకొని అతణ్ణి గుర్తించినట్టు తనూ చిరునవ్వు నవ్వాడు గోపీ. లెక్చరర్ అటు తిరగగానే ఏమీ ఎరగనట్టు నాగేశ్వరరావు నోట్సు వ్రాసుకోవడంలో మునిగి పోయాడు. అబ్బాయిల పరిశీలన పూర్తి అయ్యాక, అమ్మాయిలకేసి దృష్టి సారించాడు గోపీ. ఉన్న ఏభై మందినీ ఏభై సెకండ్లలో అలా అలా చూచిన అతని కళ్ళు మొదటి వరసలో కూర్చున్న మూడు శాల్తీలమీద పడి కాస్సేపు విశ్రాంతి తీసుకొన్నాయి. తలలు కొద్దిగా ప్రక్కకు త్రిప్పి చూచీ చూడనట్లు తనకేసి చూస్తున్న వాళ్ళు, తను అటు చూడగానే దొరికిపోయిన దొంగల్లా చూపులు మరల్చుకొన్నారు. నవ్వుకున్నాడు వాళ్ళ కంగారు చూచి; 'భలే ఉన్నారు' అనుకొన్నాడు తర్వాత. వాళ్ళ అందంకాదు అతణ్ణి ఆకర్షిస్తే; అలంకరణ. మొదటి అమ్మాయి: మర్రి ఊడల్లాంటి పొడుగాటి రెండు జడలు. రెండు జడల లోనూ రెండు ఎర్ర గులాబులు. చివరి అమ్మాయి: రెండు జడల్నీ సగానికి మడిచేసి రెంటినీ ముందుకు వడేసుకొంది. పువ్వులెందుకు బరువుచేటు అనుకొందేమో, పువ్వులు తురుముకోలేదు. ఇక మధ్య అమ్మాయి: రెండు జడలూ మువ్పాతిక పొడవుకు మడిచేసి ఒకటి ముందుకూ, ఇంకొకటి వెనక్కూ వడేసుకొంది. చివరిఅమ్మాయి: అంత సుకుమారి కాదేమో, ఒకే జడలో ఒకే

వువ్వు. అతివృష్టి, అనావృష్టి మధ్య ఊగులాడుతున్న అబలలా ఉంది. తమ బరువుకు వొంచి విరిగి పోతుందేమో అన్నంత సుకుమారంగా కూర్చున్నారు. వాళ్ళ చాలీచాలని జాకెట్లు చూస్తే భారతదేశంలో గుడ్డల కరువు వచ్చిందేమో అనిపిస్తుంది. వీళ్ళు చదువుకోవడానికి వచ్చారా.......


బుద్ధిమంతుడైన విద్యార్థిలా నాగేశ్వరరావు ఏదో చకచక వ్రాస్తున్నాడు. రెండేళ్ళక్రితం నాగేశ్వరరావూ, తమూ కలిసి చదువుకొన్న రోజులు జ్ఞాపకం వచ్చాయి గోపీకి. చాలా బీద కుటుంబంలో పుట్టాడు నాగూ. పాపం, తల్లి ఇక్కడా, అక్కడా చాకిరీచేసి వీడికి పెట్టేది. కొడుకంటే ఎంత ప్రేమ ఆమెకు! కంటిపాపలా కాపాడుకొనేది. వీడు గాడిదలా ఉన్నా పసిపిల్లాడిలా లాలించేది. అవాడ్చునాగూకు ఇష్టంలేకపోయినా, తను వాళ్ళ యింటికి వెళ్ళాడు. నిజంగా ఎలా బ్రతుకుతున్నారో అనిపించింది. మాతృప్రేమ అంటే ఏమిటో ఆ ఒక్క క్షణంలోనె అనుభవానికి వచ్చింది; తనకు తల్లిలేదు మరి. ఆ కుటుంబానికి సాయం చేద్దాం అని ఎన్నోసార్లు ప్రయత్నించాడు తను. ఆమె మాత్రం తన సహాయాన్ని స్వీకరించేది కాదు. ఆమె మాట ఎలా ఉన్నా, నాగూ ఒప్పుకునేవాడు కాదు. అంత ఆత్మాభిమాని. తనకోసం కష్టిస్తున్న తల్లి సుఖంకోసం ఏమైనాచేసి తీరాలనే ఒకే ఒక్క లక్ష్యంతో అతని




# నీకీ జీవితం వద్దు

కళ్ళు మెరుస్తూ ఉండేవి. అత దేవని చేస్తున్నా ఆ లక్ష్యం అతనిలో గోచరించేది. ఆ పట్టుదల, ఆ కార్యదీక్ష మాత్రమే అతని బాహ్యసౌందర్యం కన్నా ఎక్కువగా తనను ఆకర్షించాయి. మరి ఇప్పుడో? అతని ముఖం సౌమ్యంగా ఉంది. సహజాకర్షణలు కృత్రిమానికి తావు ఇచ్చాయి కాబోలు. ఎంత జాగ్రత్తగా రాసుకొన్నా, పౌడరు పొరలు తెలుస్తూనే ఉన్నాయి. దేవానంద్ క్రాప్. అబ్బాయిల్ని అసూయలో ముంచే అందం అతనిది. అమ్మాయిల దృష్టి అడపాదడపా నాగూవైపు ప్రసరించుతూ ఉండడం గోపీ గ్రహించకపోలేదు. జమీందారు బిడ్డలా ఉన్నాడు నాగు, ఆ టెరిలీన్ స్లేక్, ఉలెన్ పాంటులలో.

'బెల్' అయింది. అమ్మాయిలూ, ఆ వెనుక లెక్చరర్ బయటికి జారుకోగానే, నాగేశ్వరరావు పరుగెత్తుకుంటూ వచ్చేశాడు పైకి. గోపీని కౌగలించుకొన్నంత పని చేశాడు. "కాలేజీ మాట దేవుడెరుగు. పద ముందు మన రూమ్‌కి. ఎన్నో సంగతులు చెప్పాలి" అన్నాడు హుషారుగా. ఇద్దరూ బయటపడ్డారు. సైకిల్ తెచ్చుకోవడానికి గోపీ 'పార్క్' కు బయలుదేరాడు. సైకిల్‌తో తిరిగివచ్చిన గోపీకి నాగేశ్వరరావు కనిపించనేలేదు. అమ్మాయిల పటాలం మధ్య ఇరుక్కున్న 'కృష్ణుని తల' మాత్రం కనిపించింది. 'మనవాడు పెద్ద హీరో అయిపోయాడన్నమాట ఈ కాలేజీలో' అనుకొన్నాడు గోపీ, అమ్మాయిలతో అంత సోషల్‌గా మాటాడుతున్న నాగేశ్వరరావును గుర్తించి. ఆ ముగ్గురమ్మాయిలూ మరీనూ. విరగబడి నవ్వుతూ ఏవేవో మాటాడుతున్నారు వాడితో, మధ్య మధ్య తను వాళ్లను చూస్తున్నాడో, లేదో పరికిస్తూ. అసహ్యం అనిపించింది వాళ్ల ప్రవర్తన. చిరాకుగా 'బెల్' మోగించాడు. అయినా నాగూ ఈ లోకానికి వచ్చినట్టులేదు. గోపీ హృదయం మండింది. మరోసారి బెల్ మోగించి సైకిల్ నెమ్మదిగా తొక్కడం




ప్రారంభించాక, నాగూ పరుగెత్తుకుంటూ వచ్చాడు. రూమ్‌కు వెళ్లేవరకు ఏవేవో కబుర్లు చెబుతూనే ఉన్నాడు నాగూ. అయితే తన ఆస్తి ప్రసక్తిమాత్రం రాకుండా జాగ్రత్తపడుతున్నాడని గ్రహించాడు గోపీ. చిననాటి స్నేహితుణ్ణి కలుసుకొన్నందుకు కలిగిన సంతోషం ఆవిరి పోయింది గోపీలో. 'వీడు పూర్వపు నాగూ కాడు. మారిపోయాడు' అనుకొన్నాడు. అయితే ఆ అనుమానం తెలియనీయలేదు నాగూకు.

"ఇదే మన రూమ్" అన్నాడు నాగూ తాళం తీస్తూ. ఇంతవరకు అడగడానికి తటపటాయించిన గోపీ ఇక ఉండబట్టలేక "మీ అమ్మ కులాసాగా ఉన్నారా" అన్నాడు గదిలో అడుగు పెడుతూ.

"పోయింది. నీకు తెలీదూ?" కిటికీముండి ఎటో చూస్తూ అన్నాడు నాగూ. తన చెవులను నమ్మలేకపోయాడు గోపీ. ఎంత తేలికగా అనేశాడు! సిగరెట్లు అయిపోయాయి అన్నంత తేలికగా. ఆ ప్రేమమూర్తి చనిపోయిందని, తనకే ఎంతో బాధగా ఉందే, మరి వీడికో? అయినా వీడింత దర్జాగా ఎలా బ్రతుకుతున్నాడు? ఈ విషయాలేవీ ఆలోచించడానికే సావకాశం ఇవ్వలేదు నాగు. కాలేజీ విషయాలు, సినిమా విశేషాలు ఏవేవో చెబుతూనే ఉన్నాడు. భోజనం అయిన తర్వాత హోటలునుండి గోపీ తాలూకు సామాన్లన్నీ తెప్పించి రూమ్‌లో పడేశాడు. "ఈనాటినుండి మనం రూమ్ మేట్సు" అన్నాడు తృప్తిగా నిట్టూర్చుతూ. సాయంకాలంవరకు కబుర్లతో కులాసాగా గడిచిపోయింది.

అయిదు గంటలు కాగానే 'ప్రళయం' సంభవించింది. ముందు ఎంబాసిడర్ కారు, తర్వాత ఫియట్, ఆ వెనుక స్టాండర్డ్ వరుసన వచ్చి తమ రూమ్ ముందే ఆగాయి.

"హల్లో,నాగూ! ఇంకా యిల్లాగే ఉన్నావేం?" తుఫానులా విరుచుకుపడింది 'అతివృష్టి'.

"నాగీ, చప్పున టాయ్‌లెట్ కా" అని టేబిల్ దగ్గర ఉన్న గోపీని చూచి నాలిక కరుచుకొంది ముప్పాతిక జడల అమ్మాయి పాతిక హుషారు ఆవిరిపోగా.

"ఓ, వీరు నీ రూమ్ మేటా?... పరిచయం చేయి, నగేష్" ఆజ్ఞాపించింది ఆఖరున వచ్చిన 'అనావృష్టి' గోపీ కేసి ఓరగా చూస్తూ.

వీళ్లంతా ఇలా రూమ్‌మీదికి దండెత్తడంతో అంతవరకు హుషారుగా ఉన్న గోపీ గంభీరంగా ఉండిపోయాడు. ఇదేదీ గమనించే స్థితిలో లేడు నాగూ. "ఓ! పరిచయం చేయాలి కదూ? మీరంతా, వరసగా నిల్చోండి. కృష్ణ, ఈమె కమలకుమారి. రిటైర్డ్ జడ్జిగారి అమ్మాయి. ఈమె విమలకుమారి. పెద్ద పేరున్న లాయరుగారి అమ్మాయి. ఆయన పేరు మూడు అక్షరాలే అయినా ఆయన ప్రఖ్యాతి మూడు జిల్లాలు దాటింది. ఇక ఈమె నిమల్‌కుమారి. అసలు పేరు నిర్మలే. యతిప్రాసలు కుదరక

విమల అని మార్చాం. రేపు అమావాస్యనాడు 'అమల' అని మార్చుదాం అనుకొంటున్నాం. వీళ్ల నాన్నకూడ చిన్న పేరున్న పెద్ద డాక్టరు. ఇక వీడు కృష్ణ. అసలు పేరు గోపీకృష్ణ. నాకున్న ఒకే ఒక హితుడూ, స్నేహితుడూ. ఒక కంచంలో తినకపోయినా, ఒకే మంచంలో పడుకొన్నాం. మీ ముగ్గురి కార్లూ ఒకదాని మీద ఒకటి పేర్చి దానిమీద నేను ఎక్కి ఈ నయాపైసా పైకి ఎగరవేస్తే ఎంతదూరం వెళ్తుందో అంత డబ్బు ఉంది వీడికి. నాకు తెలిసినంతవరకు వీడికి ఒక్క 'గోపిక' లేదు."

నాగూ గుక్క తిప్పుకొనేసరికి, అతివృష్టి (కమల) చెంబుతో మంచినీళ్లు అందించింది. అంతా విరగబడి నవ్వేశారు. చిరునవ్వు అయినా చిందని గోపీ ముఖం చూచి, నిర్మల నవ్వడం మానేసింది.

"నమస్తే" అన్నాడు అయిష్టంగా గోపీ. వాళ్లందరూ ప్రతినమస్కారం చేశారు. "చూశావా, కృష్ణ, ఒక్క నమస్కారం పెట్టి మూడు కొట్టేశావ్" అన్నాడు నాగూ నీళ్లు తాగి. మొగమాటానికి అయినా నవ్వలేదు గోపీ.

"నాగీ, చప్పున టాయ్‌లెట్ కా. ఇదిగో సబ్బు." సబ్బు అందించి అంది ముప్పాతిక జడల విమల.

"నాగూ, ఈ సబ్బు తీసుకెళ్లు" అంటూ ఇంకో సబ్బు అందించింది కమల. రెండూ తీసుకొని బయులుదేరాడు నాగూ. ఒక్కసారిగా వర్షం వెలిసినట్టు అయింది. మర్యాదగా ఉండ దని "కూర్చోండి" అన్నాడు గోపీ ఎటో చూస్తూ అందర్నీ ఉద్దేశించి.

ఈయనకు అమ్మాయిలంటే భయమా? ఇంత అలంకరించుకొని వస్తే ఒక్కసారి, కనీసం ఒక్కసారి అయినా, తమకేసి చూడడేం అనుకొన్నారు వాళ్లు. ఉన్న రెండు కుర్చీలలో కమలా, విమలా సర్దుకున్నారు.

తను లేచి, "మీరిలా కూర్చోండి" అన్నాడు డాక్టరుగారి అమ్మాయికి కుర్చీ లేకపోవడం చూచి. "అబ్బే. ఫర్వాలేదు". అంటూ కిటికీ దగ్గర సర్దుకొంది నిర్మల.

"కష్టంలో ఉన్నవార్ని ఏదో ఇలా ఆదుకో గలుగుతున్నందుకు ఎంతో గర్వంగా ఉంది మాకు." రెండు జడలనూ ముందుకు వేసు కొని చేతులు కట్టుకొని అంది కమల. అయినా గోపీ ఆమెకేసి చూడలేదు. "వాళ్ల నాన్నకి ఎంత డబ్బు ఉంటేమాత్రం ఎందుకు? హృదయం లేకపోయింతర్వాత?" అంది విమల ఈసారి ఛాన్స్ నాది అనుకొంటూ. వీళ్లు మాట్లాడు తున్నదేమిటో అర్థంకాలేదు గోపీకి. నిర్మలకేసి చూశాడు. కిటికీ దగ్గర కూర్చొని ఎటో చూస్తోంది, వీళ్ల మాటలు వింటూ. 'వీళ్ల కన్న ఆ అమ్మాయి నయం' అనుకొన్నాడు గోపీ. దీనం పెమ్మేళ్లా, ఎదురుగా ఉన్న తమను చూడకుండా నిర్మలను చూస్తాడేం అను కొన్నారు కమలా, విమలా.

"మా 'పొటాటో' గార్ని భలే ఏడ్పించారు" అంది కమల.

గోపీ తెల్లముఖం వేశాడు.

"పొటాటో అంటే మన ఇంగ్లీషు లెక్చరర్ లెండి" అంది విమల, నవ్వుతూ. గోపీ నవ్వక పోవడంతో ముఖం ముడుచుకొంది. ముడుచుకు పోయిన ఆమె ముఖం చూచి 'అంతే కావాలి' అనుకొంది కమల.

"అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పడం కూడా ఏడిపించడమేనా?" ఏడ్పించడం అనే మాటకు అర్థం తెలియని గోపీ అడిగాడు.

అమ్మయ్య, గోపీ మాటాడుతున్నాడు, తనతో! పొంగిపోయింది కమల. "అలాటి సమాధానం చెప్పగలిగే మొగాడేడి?" అంది నవ్వుతూ.

హుషారుగా విజిల్ వేసుకొంటూ నాగూ వచ్చేశాడు. ముఖం ముడుచుకొన్న విమలనూ, అంటే ముట్టనట్టు కిటికీ దగ్గర ఉన్న నిర్మ లనూ చూచి "మౌనవ్రతం పట్టారా?" అని అడిగాడు.

విమల అక్కడినుండి లేచిపోయింది. "ఇక మీరు తయారుకండి" అంది కమల ఉత్సా హంగా. [illegible] వెళ్లిపోవడంతో, అనుకో కుండా విజయం లభించింది మరి.

"ఎందుకూ?" అన్నాడు గోపీ.

"సినిమాకిరా, నన్నాప్" అన్నాడు నాగూ తల దువ్వుకుంటూ.

"నేను రాను."

"మీరుకూడా రండి కృష్ణ ..." బతిమ లాడుతున్నట్టు అంది కమల.

"నా పేరు గోపీకృష్ణ." కాస్త కరుకుగా అన్నాడు గోపీ.

కమలిన కమలంలా తయారైంది ఆమె ముఖం. ఇంతవరకు ఎటోచూస్తూ ఉండిపోయిన నిర్మల గోపీవైపు చూచింది. గోపీ దగ్గర వీళ్ళ ఆటలేం సాగవు అనుకొంది.

"ఏరా, సినిమాకి రావూ?" బట్టలు మార్చు కొంటూ అడిగాడు నాగూ.

"రాత్రి అంతా నిద్రలేదు. కాస్త విశ్రాంతి తీసుకుంటా" అన్నాడు గోపీ.

ఆటుతర్వాత విచిత్రం అయిన నిశ్శబ్దం రాజ్యం చేసింది ఆ గదిలో. మౌనంగానే అంతా బయటపడ్డారు.

వెళ్తూ వెళ్తూ నిర్మల గోపీవంక చూసింది. తనవైపే చూస్తున్నాడు. ఆమె అడుగులు తడ బడ్డాయి.

"ఏమే, నిన్, అలా ఉన్నావు?" ఇందాకటి నుండి మౌనంగానే ఉందన్న విషయం ఇప్పుడు జ్ఞాపకంవచ్చి అడిగింది విమల.

"వంట్లో బాగులేదు. నేను సినిమాకి రాను" అంటూ వినవిన కారు దగ్గరికి పోయింది నిర్మల.

'వ్యర్థజీవులు' అనుకొన్నాడు వెళ్లిపోతున్న వాళ్ళను చూచి గోపీ. నాగూ అందంగానే ఉండచ్చు. అంతమాత్రాన హద్దూపద్దూ

ఆరోగ్యంతో
కళకళలాడే
చిన్నారిపాపలు



ప్లానిటాబ్ కు కృతజ్ఞులము

PLANITAB
OVULES

సున్నితము * సులభము * తక్కువ ఖర్చు
మీ డాక్టరును లేక
ఎఫ్. పి. క్లినిక్‌లను సంప్రదించండి

HIND CHEMICALS LTD., KANPUR

సగానికన్న తక్కువధర ఒక నెలవరకు
హోం సినిమా




WAS Rs. 40 NOW ONLY Rs. 15/-

ప్రపంచపు అద్భుతమైన గృహ కాలక్షేపం. కొత్తగా కనిపెట్టబడింది. మీ అభిమాన ఫిలిం తారల అద్భుత, శృంగార, నాట్య హాస్య, సాహస కృత్యాలను మీ ఇంట్లో సకుటుంబ, మిత్రసమేతంగా చూచి ఆనందించండి. బొమ్మలు సినిమా తెరమీదలాగానే వాస్తవికంగా కళ కాంతులతో కన్పిస్తూ మిమ్ము ఆశ్చర్య చకితులను చేస్తవి, ప్రేక్షకులను ఆకర్షిస్తవి. హోం సినిమా ఉచితమైన ఫిలింరీల్‌తోసహా, ఉపయోగానికి సిద్ధంగా సంపూర్తిగా ఉన్నది రు. 15 — లు. వివిధ విషయాలలో అదనపు రీళ్లు ఒకొక్కటి రు. 5/— ల చొప్పున ఇండియాలో మావద్ద మాత్రమే ఉన్నవి. సప్లయిలు పరిమితంగా ఉన్నవి. పోస్టేజి రు. 2—50 న్పై. విశేషమైన గిరాకీ. డబ్బు ఇప్పుడు పంపనవద్దు. మీఇంటివద్ద బట్వాడా చేసిన వెంటనే పోస్టుమన్‌కు చెల్లించండి. త్వరపడండి. మీ ఆర్డరు నేడే పంపండి.

AMERICAN SUPPLIES STORE
Chitli Kubar, Delhi-6.

దృఢనిశ్చయంతో
కృషిచేయి
దీక్షతో
పనిచేయండి

ఓవల్ జోన్
కమ్మని పానీయము :
బలము నిచ్చును.
GLADSTON AGENCIES
KAKINADA.

ఆటోమాటిక్ బాటరీ ఫాన్
రు. 10/- లకు.



WAS Rs. 35 NOW ONLY Rs. 10
జపాన్‌చే క్రొత్తగా కనిపెట్టబడినది

వేసవిలో చల్లటిగాలి నానందించండి. ఇంటా, బయటా ఉపయోగిస్తుంది. దీన్ని ఆఫీసులో, ఫ్యాక్టరీలో, సినిమాలో, రైలులో, బస్సులో, కారులో ఎక్కడైనా, ఎప్పుడైనా వాడవచ్చును. బాటరీతో ఆపరేట్ చేయబడునది. నిజంగా జీవితపర్యంతం పని చేస్తుంది. శక్తివంతమైనది, కానిపూర్తిగ భద్రమైనది. తేలికైనది, విశ్వజ్ఞమైనది, ఖర్చు తక్కువైనది. వాడుటానికి సిద్ధంగా పంపబడుతుంది. మావద్ద మాత్రమే లభిస్తుంది. పరిమితమైన సప్లయిలు. పోస్టేజి రు. 1/50 పైన. మీ ఆర్డరును నేడే పంపండి.

JAPAN TRADING AGENCY,
2194-Kalyanpura, DELHI-6.

# నీకీ జీవితం వద్దు

లేకుండా ఇలా బరితెగించి ఎగబడుతున్న వీళ్ళు ఛీఛీ అని చీదరించుకొన్నాడు. కాలేజీ అమ్మాయిలంటే సదభిప్రాయం పోవడానికి ఇలాంటివాళ్ళే కారణం. ఇప్పుడు కాస్త ఆలోచించుకోవడానికి వీలు చిక్కింది గోపీకి. ఆలోచిస్తూ అలాగే ఉండిపోయాడు. నాగూ జీవనవిధానం స్పష్టాస్పష్టంగా కనిపించింది.

* * * *

ఉదయం బెడ్డింగ్ సర్దుకొంటున్న గోపీకేసి అనుమానంగా చూచాడు నాగూ. మౌనంగా గోపీ తన పని చేసుకుంటూ ఉన్నాడు.

"ప్రయాణమా?" భయపడుతూనే అడిగాడు నాగూ. అయినా సమాధానం లేదు. ఆ దూకుడు చూస్తే రూమ్‌నుండి వెళ్ళిపోతాడేమో అనిపించింది.

"ఏరా, నావల్ల ఏదైనా పొరబాటు జరిగిందా? క్షమించరా. నిన్ను వదిలేసి సినిమాకి వెళ్ళిపోయాం అనా కోపం?" నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాడు నాగూ.

గోపీ ఆగి, నాగూకేసి చూచాడు. ఆ తీవ్రతను తట్టుకోలేక ముఖం తిప్పుకొన్నాడు నాగూ. గోపీ మళ్ళీ తన పనిలో నిమగ్నమైనాడు. నిజంగా గోపీకి కోపం వచ్చిందన్నమాట.

"నేను చేసిన అపరాధం ఏమిటో చెప్పరాదూ....." దుఃఖాన్ని శతవిధాల దిగమింగడానికి ప్రయత్నిస్తూ అడిగాడు నాగూ. అయినా అతని కంఠంలో వ్యథ ధ్వనిస్తూనే ఉంది.

"నిజంగా నీకు తెలియదా?" నెమ్మదిగా అయినా తీవ్రంగా అడిగాడు గోపీ. అగ్నిగోళాలులా మండిపోతున్న ఆ కళ్ళను చూడలేక నాగూ ముఖం దాచుకొన్నాడు.

"నావాడు అనుకొన్న నాగూ చచ్చిపోయాడురా. నువ్వు ఇప్పుడు డబ్బుఉన్నా హృదయం లేని లక్షాధికారి కొడుకువి."

ఆ స్వరంలో వెటకారం కొరడాదెబ్బలా ఛెళ్ళుమని తగిలింది. వణికిపోయాడు నాగూ.

"ఇప్పుడు నువ్వెవరో, నేనెవరో?" చకచక గుమ్మంవైపు నడిచిపోతున్న గోపీని ఆపాడు నాగూ. "నిన్ను వెళ్ళనివ్వను" అన్నాడు గుమ్మానికడ్డంగా నిల్చొని.

కంటినుండి ధారగా స్రవిస్తున్న కన్నీళ్ళు చూచి కరిగిపోయాడు గోపీ. తను ఊహించింది పొరబాటు ఏమో అనుకొన్నాడు. పొరబాటు కాదు అనిపించింది మరుక్షణమే. తలుపును ఆనుకొని కళ్ళు మూసుకొని నెమ్మదిగా అన్నాడు: "నాగూ, నీకు జ్ఞాపకం ఉందా? నీవు జీతం కట్టలేకపోతే నేను కట్టాను ఒకసారి నీకు తెలియకుండా. ఆ మర్నాడు నా డబ్బు వడ్డీతో సహా తిరిగి తెచ్చి ఏమన్నావో జ్ఞాపకం ఉందా?" కళ్ళు తెరిచి నాగూకేసి సూటిగా చూచి అన్నాడు గోపీ. ఇప్పుడు అతని కంఠంలో సౌమ్యం మాయమైంది.

" 'నేనింకా అడుక్కొనే స్థితికి రాలేదురా. అలాంటి పరిస్థితే వస్తే తప్పకుండా మొట్టమొదట నీ దగ్గరకే వస్తాను' అన్నావు. జ్ఞాపకం లేదూ? ఏదీ నీకిప్పుడా ఆత్మాభిమానం? నీవు ఇప్పుడుంటున్న రూమ్, నేసుకొన్న టెరిలిన్ పాంటూ, టెరిలిన్ స్లాక్ ఆ అమ్మాయిలు ధర్మంగా పడేసినవి కావూ? ఇంత నీచమైన బ్రతుకు ఎందుకురా నీకు? ఒకరి ధర్మం మీద—కాదు, ముగ్గురి ధర్మంమీద— బ్రతకడం, చదవడం ఎందుకు? మానేసి ఏదో కాయకష్టం చేసుకొంటే నీ ఒక్కడి పొట్టా గడిచిపోదా? డిగ్రీ ఉంటేగాని కాదనుకొనేవాడివి, ఉద్యోగం చేసుకుంటూ రాత్రి కాలేజీలో చేరలేకపోయావ్? కాదు. కాయకష్టం లేకుండా బ్రతకాలనుకొన్నావ్. అందంగా ఉన్నావ్. ఆ సంగతి నీకు తెలుసు. అదే తెచ్చింది నీకీ వినాశం. అమ్మాయిలకి ఎరగా వేశావ్ నీ అందాన్ని. లక్షాధికారి కొడుకువనీ, కష్టాల్లో ఉన్నావనీ కల్లబొల్లి కబుర్లు చెప్పావ్. నీతి, అవినీతి, కల్ల, నిజం కానుకోలేనివాళ్ళు ఒకరిమీద ఒకరు పోటీపడి నిన్ను మేపుతున్నారు. శరీరం అమ్ముకొని వేశ్య జీవిస్తుంది. నువ్వూ బ్రతుకుతున్నావ్..."

"యూ షటప్!" గర్జించాడు నాగూ. గోపీ చెంప ఛెళ్ళుమంది. గోపీ గనుక ఆ దెబ్బకు ఆగగలిగాడు. మరొకడైతే.....

ఇప్పటికి ఆవేశం తగ్గి ఆలోచనలో పడ్డాడు గోపీ. ఎంతెంత మాటలన్నాడని తను? అసలు నాగూ ఏమైపోతున్నాడో, ఎంత బాధ పడుతున్నాడో గుర్తించకుండానే ఆవేశంలో ఏవేవో వాగాడు తను. చెంప చేత్తో అదుముకొని "వద్దు నాగూ, నీకీ జీవితం వద్దు" అన్నాడు.

తన హితంకోరే స్నేహితుణ్ణే ఆవేశంలో కొట్టానని నాగూ హృదయం ఘోషించింది. ఏం చేస్తాడు తను? గోపీ ఒక్కొక్క మాటా శూలంలా తనను అన్ని దిక్కులనుండి తూట్లు చేస్తూంటే? హృదయం విలవిలలాడి పోయింది. ఎంత దెబ్బ కొట్టాడు తను! తన చెయ్యే మండుతూందే! కన్నీళ్లను ఎడమచేత్తో తుడుచుకొన్నాడు. ఆ కన్నీళ్లలో అతని కళ్ళకు కట్టిన తెరలు కరిగిపోయాయి. "క్ష...క్షమించరా" అన్నాడు.

సర్రున వెనక్కు తిరిగాడు గోపీ. "క్షమించాను గనుక, నువ్వింకా నా ఎదుట నిలబడి మాటాడుతున్నావు" అన్నాడు.

ఎంత ఆపుకొన్నా క[illegible]డంలేదు గోపీకి. వెళ్ళడానికి రిక్షాలేవీ కనిపించలేదు. బెడ్డింగ్ చేత్తో పుచ్చుకొని బయలుదేరబోయాడు.

"కృష్ణ...." తల్లినుండి వేరుచేయబడిన బిడ్డలా బావురుమన్నాడు నాగూ. "కృష్ణ, నన్ను క్షమించవూ?"

వాచిన చెంప ఎడమచేత్తో నొక్కుకుంటూ అన్నాడు గోపీ: "నేను కాదు క్షమించాల్సింది; మీ అమ్మ! మాటల్లో కాదు నీవు క్షమాభిక్ష అర్థించవలసింది......" బెడ్డింగ్ బరువుకు ఊగిపోతూ వెళ్ళిపోయాడు గోపీ.

నాగేశ్వర్రావు కాలేజీ మానేశాడు. ★